శ్రీ హనుమతే నమః          శ్రీ రామాయ నమః          శ్రీ శివానందాయ నమః



శ్రీ "సుందరదాసు" ఎం.ఎస్.రామారావు గారి

**"సుందరకాండ"**

శ్రీ హనుమాను గురుదేవులు నా యెద
పలికిన సీతారామ కథ
నే పలికెద సీతారామ కథ.

శ్రీ హనుమంతుడు అంజనీసుతుడు,
అతి బలవంతుడు, రామభక్తుడు.
లంకకు పోయి రాగల ధీరుడు,
మహిమోపేతుడు, శత్రుకర్షణుడు.

జాంబవదాది వీరులందరును,
ప్రేరేపింపగ సమ్మతించెను.
లంకేశ్వరుడు అపహరించిన,
జానకీమాత జాడ తెలిసికొన.

తన తండ్రి అయిన వాయుదేవునకు,
సూర్య చంద్ర బ్రహ్మాది దేవులకు,
వానరేంద్రుడు మహేంద్రగిరి పై,
వందనములిడె పూర్వాభిముఖుడై.

రామనామమున పరవశుడయ్యె,
రోమరోమమున పులకితుడయ్యె.
కాయము పెంచె, కుప్పించి యెగసె,
దక్షిణ దిశగా, లంక చేరగా.

పవనతనయుని పదఘట్టనకే,
పర్వతరాజము గజగజ వొణకె.
ఫలపుష్పాదులు జలజల రాలె,
పరిమళాలు గిరిశిఖరాలు నిండె.

పగిలిన శిలలా ధాతువులెగసె,
రత్నకాంతులు నలుదెసల మెరసె.
గుహలను దాగిన భూతములదిరి,
దీనారవముల పరుగిడె బెదిరి.

|| శ్రీ హనుమాను ||

రఘుకులోత్తముని రామచంద్రుని,
పురుషోత్తముని పావన చరితుని,
నమ్మిన బంటుని అనిలాత్మజుని,
శ్రీ హనుమంతుని స్వాగతమిమ్మని,

నీ కడ కొంత విశ్రాంతి తీసికొని,
పూజలందుకొని పోవచ్చునని,
సగర ప్రవర్ధితుడు సాగరుడెంతో,
ముదమున పలికె మైనాకునితో.

మైనాకుడు ఉన్నతుడై నిలిచె,
హనుమంతుడు ఆగ్రహమున గాంచె.
ఇదియొక విఘ్నము కాబోలునని,
వారిధి పడద్రోసె ఉరముచే గిరిని.

పర్వత శ్రేష్ఠుడా పోటున కృంగె,
పవనతనయుని బలము గని పొంగె.
తిరిగి నిలిచె, హనుమంతుని పిలిచె,
తన శిఖరముపై నరుని రూపమై.

|| శ్రీ హనుమాను ||

"వానరోత్తమా ఒకసారి నిలుమా (2),
నా శిఖరాల శ్రమ తీర్చుకొనుమా.
కందమూలములు ఫలములు తినుమా,
నా పూజలు గొని మన్ననలందుమా.

శత యోజనముల పరిమితముగల,
జలనిధినవలీల దాటిపోగల,
నీదు మైత్రి కడు ప్రాప్యము నాకు,
నీదు తండ్రి కడు పూజ్యుడు నాకు."

పర్వతోత్తముని కరమున నిమిరి,
పవనతనయుడు పలికెను ప్రీతిని.
"ఓ గిరీంద్రమా సంతసించితిని,
నీ సత్కారము ప్రీతినందితిని.

రామకార్యమై యేగుచుంటిని,
సాధించువరకు ఆగనంటిని.
నే పోవలె క్షణమెంతో విలువలె,
నీ దీవనలే నాకు బలములె.

|| శ్రీ హనుమాను ||

అనాయాసముగ అంబరవీధిని,
పయనము జేసెడు పవనకుమారుని,
ఇంద్రాదులు మహర్షులు సిద్ధులు,
పులకాంకితులై ప్రస్తుతించిరి.

రామకార్యమతి సాహసమ్మని,
రాక్షసబలమతి భయంకరమని.
కపివరుడెంతటి ఘనతరుడోయని,
పరిశీలనగా పంపిరి సురసను.

"ఎపుడో నన్ను నిన్ను మ్రింగమని,
వరమొసగి మరీ బ్రహ్మ పంపెనని"
అతిగా సురస నోటిని దెరచె,
హనుమంతుడలిగి కాయము పెంచె.

ఒకరినొకరు మించి కాయము పెంచిరి,
శత యోజనములు విస్తరించిరి.
పైనుండి సురలు తహతహలాడిరి,
ఇరువురిలో ఎవ్వరిదో గెలుపనిరి.

సురస ముఖము విశాలమౌట గని,
సూక్ష్మబుద్ధి గొని సమయమిదేనని,
క్షణములోన అంగుష్ఠమాతృడై,
ముఖము చొచ్చి వెలివచ్చె విజయుడై.

పవనకుమారుని సాహసము గని,
దీవించె సురస నిజ రూపము గొని.
నీలాలంబ నీలాంబరము గనుచు,
మారుతి సాగెను వేగము పెంచుచు.

జలనిధి తేలే మారుతి ఛాయను,
రాక్షసి సింహిక అట్టె గ్రహించెను.
గుహను బోలు తన నోటిని తెరచెను,
కపివరుని గుంజి మ్రింగజూచెను.

అంతట మారుతి సూక్ష్మరూపమున,
సింహిక ముఖమును చొచ్చి చీల్చెను.
సింహిక హృదయము చీలికలాయెను,
సాగరమున బడి అసువులు బాసెను.

వారిధి దాటెను వాయుకుమారుడు,
లంక జేరెను కార్యశూరుడు.
నలువంకలను కలయజూచుచు,
నిజ రూపమున మెల్లగ సాగుచు,

త్రికూటాచల శిఖరముపైన,
విశ్వకర్మ వినిర్మితమైన,
స్వర్గపురముతో సమానమైన,
లంకాపురమును మారుతి గాంచెను.

|| శ్రీ హనుమాను ||

అనిలకుమారుడా రాత్రివేళను,
సూక్ష్మరూపుడై బయలుదేరెను.
రజనీకరుని వెలుగున తాను,
రజనీచరుల కనులబడకను.

పిల్లివలె పొంచి మెల్లగ సాగెను,
ఉత్తర ప్రాకార ద్వారము జేరెను.
లంకారాక్షసి కపివరు గాంచెను,
గర్జన సేయుచు అడ్డగించెను.

"కొండ కోనల తిరిగాడు కోతివి,
ఈ పురికి యే పనికై వచ్చితివి?
లంకేశ్వరుని ఆనతి మేర,
లంకాపురికి కావలి యున్న,

లంకను నేను లంకాధిదేవతను.
నీ ప్రాణములను నిలువున తీతును.
కదలక మెదలక నిజము పల్కుమని",
లంక యెదుర్కొనె, కపి కిశోరుని.

"అతి సుందరమీ లంకాపురమని,
ముచ్చట పడి నే చూడవచ్చితిని.
ఈ మాత్రమునకు కోపమెందుకులే,
పురము గాంచి నే మరలిపోదులే."

అని నెమ్మదిగా పలుకగా విని,
అనిలాత్మజుని చులకనగాకొని,
లంకా రాక్షసి కపికిశోరుని,
గర్జించి కసరె, గర్దించి చరచెను.

సింహ నాదమును మారుతి చేసె,
కొండంతగ తన కాయము పెంచె.
వామ హస్తమున పిడికిలి బిగించె,
ఒకే పోటున లంకను గూల్చె.

కొండ బండలా రక్కసి దొర్లె,
కనులప్పగించి నోటిని దెరచె.
అబలను చంపుట ధర్మము గాదని,
లంకను విడిచె మారుతి దయగొని.

"ఓ బలభీమా ! వానరోత్తమా !,
నేటికి నీచే ఓటమెరిగితిని,
ఈ నా ఓటమి, లంకకు చేటని,
పూర్వమే బ్రహ్మ వరమొసగెనని,

రావణుడాదిగ రాక్షసులందరు,
సీతమూలమున అంతమొందెదరు.
ఇది నిజమౌనని, నీదే జయమని,
లంకారాక్షసి పంపె హరేశుని.

|| శ్రీ హనుమాను ||

కోట గోడ అవలీలగ ప్రాకెను,
కపి కిశోరుడు లోనికి దుమికెను.
శత్రుపతనముగ వామపాదమును,
ముందుగ మోపెను ముందుకు సాగెను.

ఆణిముత్యముల తోరణాలు గల,
రమ్యతరమైన రాజవీధుల,
వెన్నెలలో లంకాపురి శోభను,
శోధనగా హరేశుడు గాంచెను.

సువర్ణమయా సౌధరాజముల,
ధగధగ మెరసే ఉన్నత గృహముల,
కళకళలాడే నవ్వుల జల్లులు,
మంగళకరమౌ నృత్యగీతములు.

అప్సరసల మరపించు మదవతుల,
త్రిస్థాయి గొలుపు గానమాధురులు,
వెన్నెలలో లంకాపురి శోభను,
శోధనగా హరేశుడు గాంచెను.

సుందరమైన హేమ మందిరము,
రత్నఖచితమౌ సింహద్వారము,
పతాకాంకిత ధ్వజాకీర్ణము,
నవరత్నకాంతి సంకీర్ణము,

నృత్య మృదంగ గంభీర నాదితము,
వీణాగాన వినోద సంకులము,
లంకేశ్వరుని దివ్యభవనమది,
శోధనగా హరేశుడు గాంచెను.

అత్తరు పన్నీట జలకములు,
కాలాగరు సుగంధ ధూపములు,
స్వర్ణ ఛత్రములు, వింజామరలు,
కస్తూరి పునుకు జవాది గంధములు,

నిత్య పూజలు, శివార్చనలు,
మాసపర్వముల హోమములు,
లంకేశ్వరుని దివ్యభవనమది,
శోధనగా హరేశుడు గాంచెను.

|| శ్రీ హనుమాను ||

యమకుబేర వరుణ దేవేంద్రాదుల,
సర్వసంపదల మించినది.
విశ్వకర్మ తొలుత బ్రహ్మకిచ్చినది,
బ్రహ్మవరమున కుబేరుడందినది.

రావణుండు కుబేరుని రణమందు,
ఓడించి లంకకు కొని తెచ్చినది.
పుష్పకమను మహా విమానమది,
మారుతి గాంచెను అచ్చెరువొంది.

నేలను తాకక నిలచియుండునది,
రావణ భవన మధ్యంబుననున్నది.
వాయుపథమున ప్రతిష్ఠితమైనది,
మనమున తలచిన ప్రీతిపోగలది.

దివినుండి భువికి దిగిన స్వర్గమది,
సూర్యచంద్రులను ధిక్కరించునది.
పుష్పకమను మహా విమానమది,
మారుతి గాంచెను అచ్చెరువొంది.

లంకాధీశుని ప్రేమ మందిరము,
రత్నఖచితమౌ హేమ మందిరము.
చందనాది సుగంధ బంధురము,
పానభక్ష్య పదార్థ సమృద్ధము.

ఆయా పరిమళ రూపానిలము,
అనిలాత్మజుచే ఆఘ్రాణితము.
పుష్పకమందు రావణమందిరమ్మది,
మారుతి గాంచెను అచ్చెరువొంది.

మత్తున శయనించు సుదతుల మోములు,
పద్మములనుకొని ముంగు భ్రమరములు.
నిమీలిత విశాల నేత్రములు,
నిశాముకుళిత పద్మపత్రములు.

ఉత్తమ కాంతల కూడి రావణుడు,
తారాపతి వలె తేజరిల్లెడు.
పుష్పకమందు రావణమందిరమ్మది,
మారుతి గాంచెను అచ్చెరువొంది.

రావణుండు రణమందున గెలిచి,
స్త్రీలెందరినో లంకకు చేర్చెను.
పితృ దైత్య గంధర్వ కన్యలు,
ఎందెందరో రాజర్షి కన్యలు.

సీత తక్క వారందరు కన్యలె,
రావణు మెచ్చి వరించిన వారలె.
పుష్పకమందు రావణమందిరమ్మది,
మారుతి గాంచెను అచ్చెరువొంది.

|| శ్రీ హనుమాను ||

ఐరావతము దంతపు మొనలతో,
పోరున పొడిచిన గంటులతో,
వజ్రాయుధపు ప్రఘాతములతో,
చక్రాయుధపు ప్రహరణములతో,

జయపరంపరల గురుతులతో,
కీర్తి చిహ్నముల కాంతులతో,
లంకేశుడు శయనించె కాంతలతో,
సీతకై వెదకె మారుతి ఆశతో.

మినప రాశి వలె నల్లని వాడు,
తీక్షణ దృక్కుల లోహితాక్షుడు.
రక్తచందన చర్చిత గాత్రుడు,
సంధ్యారుణ ఘన తేజోవంతుడు.

సతులగూడి మధు గ్రోలిన వాడు,
రతికేళి సలిపి సోలిన వాడు,
లంకేశుడు శయనించె కాంతులతో,
సీతకై వెదకె మారుతి ఆశతో.

అందొక వంక పర్యంకము చేరి,
నిదురించుచుండె దివ్యమనోహరి.
నవరత్నఖచిత భూషణ ధారిణి,
నలువంకలను కాంతి ప్రసారిణి.

స్వర్ణ దేహిని, చారు రూపిణి,
రాణులకు రాణి పట్టపు రాణి,
లంకేశ్వరుని హృదయేశ్వరి,
మండోదరి లోకోత్తర సుందరి.

మండోదరిని జానకి యనుకొని,
ఆడుచు పాడుచు గంతులు పెట్టి,
వాలము బట్టి ముద్దులు పెట్టి,
నేలను గొట్టి భుజములు తట్టి,

స్తంభములెగసి క్రిందకు దుమికి,
పల్లటీలు కొట్టి చెంగున చుట్టి.
చంచలమౌ కపిస్వభావమును,
పవనతనయుడు ప్రదర్శన చేసెను.

|| శ్రీ హనుమాను ||

రాముని సీతా యిటులుండునా (2),
రావణు జేరి శయనించునా ?
రాముని బాసి నిదురించునా,
భుజయించునా, భూషణముల దాల్చునా ?

పరమ పురుషుని రాముని మరచునా,
పర పురుషునితో కాపురముండునా ?
సీత కాదు కాదు కానేకాదని,
మారుతి వగచుచు వెదకసాగెను.

పోవగరాని తావుల పోతి,
చూడగరానివి యెన్నో చూచితి.
నగ్నముగా పరున్న పరకాంతల,
పరిశీలనగా పరికించితిని.

రతికేళి సలిపి సోలిన రమణుల,
ఎందెందరినో పొడగాంచితిని.
ధర్మము గానని పాపినైతివని,
పరితాపముతో మారుతి కృంగెను.

సుదతుల తోడ సీతయుండగా,
వారల జూడక వెదకుటెలాగ ?
మనసున యేమి వికారమునొందక,
నిష్కామముగ వివేకము వీడక,

సీతను వెదకుచు చూచితి గాని,
మనసున యేమీ పాపమెరుగనని.
స్వామి సేవ పరమార్ధముగా గొని,
మారుతి సాగెను సీత కోసమని.

భూమీగృహములు నిశాగృహములు,
క్రీడాగృహములు లతాగృహములు,
ఆరామములు చిత్రశాలలు,
బావులు తిన్నెలు రచ్చవీధులు,

మేడలు మిద్దెలు ఇళ్లు కోనేళ్లు,
సందులు గొందులు బాటలు తోటలు.
ఆగి ఆగి అడుగడుగున వెదకుచు,
సీతను గానక మారుతి వగచె.

సీతామాత బ్రతికి యుండునో,
క్రూర రాక్షసుల పాల్పడి యుండునో ?
తాను పొందని సీత యెందుకని,
రావణుడే హతమార్చి యుండునో ?

అని యోచించుచు అంతట వెదకుచు,
తిరిగిన తావుల తిరిగి తిరుగుచు,
ఆగి ఆగి అడుగడుగున వెదకుచు,
సీతను గానక మారుతి వగచె.

సీత జాడ కనలేదను వార్తను,
తెలిపిన రాముడు బ్రతుకజాలడు.
రాముడు లేనిదె లక్ష్మణుడుండడు,
ఆపై రఘుకులమంతయు నశించు.

ఇంతటి ఘోరము కాంచినంతనె,
సుగ్రీవాదులు మడియక మానరు,
అని చింతించుచు పుష్పకము వీడి,
మారుతి చేరె ప్రాకారము పైకి.

ఇంత వినాశము నా వల్లనేను,
నే కిష్కింధకు పోనే పోను.
వానప్రస్థాశ్రమవాసుడనై,
నియమ నిష్ఠలతో బ్రతుకువాడనై.

సీతామాతను చూచితీరెదను,
లేకున్న నేను అగ్ని దూకెదను.
అని హనుమంతుడు కృత నిశ్చయుడై,
నలుదెసల గనె సాహసవంతుడై.

చూడ మరచిన అశోక వనమును,
చూపు మేరలో మారుతి గాంచెను.
సీతారామ లక్ష్మణాదులకు,
ఏకాదశ రుద్రాది దేవులకు,

ఇంద్రాది యమ వాయుదేవులకు,
సూర్యచంద్ర మరుద్గణములకు,
వాయునందనుడు వందనములిడి,
అశోకవని చేరెను వడివడి.

|| శ్రీ హనుమాను ||

విరితేనియలి గ్రోలు భృంగములు,
విందారగ సేయు ఝుంకారములు.
లేచివురాకుల నెసవు కోయిలలు,
పంచమ స్వరముల పలికే పాటలు.

పురులు విప్పి నాట్యమాడు నెమళులు,
కిలకిలలాడే పక్షుల గుంపులు.
సుందరమైన అశోకవనమున,
మారుతి వెదకెను సితను కనుగొన.

కపికిశోరుడు కొమ్మకొమ్మను,
ఊపుచు ఊగుచు తూగసాగెను,
పూవులు రాలెను, తీగెలు తెగెను,
ఆకులు కొమ్మలు నేలపై పడెను.

పూలుపై రాల పవనకుమారుడు,
పుష్పరథము వలె వనమున దోచెడు.
సుందరమైన అశోకవనమున,
మారుతి వెదకెను సితను కనుగొన.

పూవులనిన పూతీవియలనిన,
జానకికెంతో మనసౌనని,
పద్మపత్రముల పద్మాక్షుని గన,
పద్మాకరముల వొంత జేరునని,

అన్ని రీతులా అనువైనదని,
అశోకవని సీత యుండునని.
శీఖిల్లు శింశుపా తరుశాఖలపై,
మారుతి కూర్చొని కలయజూచెను.

|| శ్రీ హనుమాను ||

సుందరమైన అశోకవనమున,
తను కూర్చొనిన తరువు క్రిందున,
కృంగి కృశించిన సన్నగిల్లిన,
శుక్లపక్షపు చంద్రరేఖను,

ఉపవాసముల వాడిపోయిన,
నివురు గప్పిన నిప్పు కణమును,
చిక్కిన వనితను మారుతి గాంచెను,
రాక్షస వనితల క్రూర వలయమున.

మాసిన పీత వసనము దాల్చిన,
మన్నున పుట్టిన పద్మమును,
పతి వియోగ శోకాగ్ని వేగిన,
అంగారక పీడిత రోహిణిని,

మాటిమాటికి వేడి నిట్టూర్పుల,
సెగలను గ్రక్కే అగ్ని జ్వాలను,
చిక్కిన వనితను మారుతి గాంచెను,
రాక్షస వనితల క్రూర వలయమున.

నీలవేణి సంచాలిత జఘనను,
సుప్రసిద్ధను, సింహమధ్యను,
కాంతులొలుకు ఏకాంత ప్రశాంతను,
రతీదేవి వలె వెలయు కాంతను,

పుణ్యము తరిగి దివి నుండి జారి,
శోక జలధి పడి మునిగిన తారను,
చిక్కిన వనితను మారుతి గాంచెను,
రాక్షస వనితల క్రూర వలయమున.

పతి చెంతలేని సతికేలనని,
సీత సొమ్ముల దగిల్చె శాఖల.
మణిమయ కాంచన కర్ణవేష్టములు,
మరకత మాణిక్య చంవసరాలు.

రత్నఖచితమౌ హస్త భూషలు,
నవరత్నాంకిత మణిహారములు.
రాముడు తెలిపిన గురుతులు గలిగిన,
ఆభరణముల గుర్తించె మారుతి.

సర్వసులక్షణ లక్షిత జాత,
సీత గాక మరి యెవరీ మాత ?
కౌసల్యా సుప్రజా రాముని,
సీత గాక మరి యెవరీ మాత ?

వనమున తపించు మేఘ శ్యాముని,
సీత గాక మరి యెవరీ మాత ?
ఆహా కంటి కనుగొంటి సీతనని,
పొంగి పొంగి ఉప్పొంగె మారుతి.

|| శ్రీ హనుమాను ||

పూవులు నిండిన పొలములందున,
నాగేటిచాలున జననమందిన,
జనక మహారాజు కూతురైన,
దశరథ నరపాలు కోడలైన,

సీతాలక్ష్మకి కాదు సమానము,
త్రైలోక్యరాజ్య లక్ష్మి సహితము,
అంతటి మాతకా కాని కాలమని,
మారుతి వగచె సీతను కనుగొని.

శత్రుతాపకరుడు మహాశూరుడు,
సౌమిత్రికి పూజ్యరాలైన,
ఆశ్రితజన సంరక్షుడైన,
శ్రీ రఘురాముని ప్రియసతి అయిన,

పతి సన్నిధియే సుఖమనియెంచి,
పదునాల్గేండ్లు వనమునకేగిన,
అంతటి మాతకా కాని కాలమని,
మారుతి వగచె సీతను కనుగొని.

బంగరు మేని కాంతులు మెరయ,
మందస్మిత ముఖ పద్మము విరియ,
హంస తూలికా తల్పమందున,
రాముని గూడి సుఖింపగ తగిన,

పురుషోత్తముని , పావన చరితుని,
శ్రీ రఘురాముని ప్రియసతి యైన,
అంతటి మాతకా కాని కాలమని,
మారుతి వగచె సీతను కనుగొని.

||శ్రీ హనుమాను ||

మూడు ఝాముల రేయి గడువగా,
నాల్గవ ఝాము నడచుచుండగా,
మంగళవాద్య మనోహర ధ్వనులు,
లంకేశ్వరుని మేలుకొలుపులు.

క్రతువులొనర్చు షడంగవేదవిదుల,
స్వరయుగ శబ్దతరంగ ఘోషలు,
శోభిల్లు శింశుపా శాఖలందున,
మారుతి కూర్చొని ఆలకించెను.

రావణాసురుడు శాస్త్రోక్తముగా,
వేకువనే విధులన్ని వొనర్చెను.
మదోత్కటుడై మదనతాపమున,
మరిమరి సితను మదిలో నించెను.

నూర్గురు భార్యలు సురకన్యల వలె,
పరిసేవింపగ దేవేంద్రుని వలె,
దశకంఠుడు దేదీప్యమానముగ,
వెడలెను అశోకావనము చేరగా.

లంకేశునితో వెడలిరి సతులు,
మేఘము వెంట విద్యుల్లతలవలె .
మధువు గ్రోలిన పద్మముఖుల,
ముంగురులు రేగె భృంగములవలె.

క్రీడల తేలిన కామినీ మణుల,
నిద్రలేమి పడు అడుగులు తూలె.
దశకంఠుడు దేదీప్యమానముగ,
చేరెను అశోకావనము వేగముగా.

లంకేశుని మహా తేజముని గని,
మారుతి కూడ విభ్రాంతి చెందెను.
దశకంఠుడు సమీపించి నిలిచెను.
సీత పైననే చూపులు నిలిపెను.

తొడలు చేర్చుకొని కడుపును దాచి,
కరములు ముడిచి,
సుడిగాలి పడిన కదళీ తరువు వలె,
కటిక నేలపై జానకి తూలె.

|| శ్రీ హనుమాను ||

ఓ సీతా ! ఓ పద్మనేత్రా!
నా చెంత నీకు యేలా చింతా ?
ఎక్కడి రాముడు ? ఎక్కడి అయోధ్య ?
ఎందుకోసమీ వనవాస వ్యథ ?

నవ యౌవ్వన త్రిలోక సుందరి,
నీకెందుకు యీ మునివేషధారి ?
అని రావణుడు కామాంధుడై నిలిచె,
నోటికి వచ్చినదెల్ల పలికె .

రాముడు నీకు సరికాని వాడు,
నిను సుఖపెట్టడు, తను సుఖపడడు.
మతిచెడి వనమున తిరుగుచుండెనో,
తిరిగి తిరిగి తుదకు రాలిపోయెనో.

మరచిపొమ్మ ఆ కొరగాని రాముని,
వలచి రమ్మ నను యశోవిశాలుని.
అని రావణుడు కామాంధుడై నిలిచె,
నోటికి వచ్చినదెల్ల పలికె .

రాముడు వచ్చుట నన్ను గెల్చుట,
నిన్ను పొందుట కలలోని మాట.
బలవిక్రమధనయశములందున,
అల్పుడు రాముడు నాముందెందున.

యమకుబేర ఇంద్రాది దేవతల,
గెలిచిన నాకిల నర భయమేల ?
అని రావణుడు కామాంధుడై నిలిచె,
నోటికి వచ్చినదెల్ల పలికె .

|| శ్రీ హనుమాను ||

నిరతము పతినే మనమున తలచుచు,
క్షణమొక యుగముగ కాలము గడుపుచు,
రావణ గర్వ మదంబుల ద్రుంచు,
రాముని శౌర్యధైర్యముల దలచుచు,

శోకతప్తయై శిరమును వంచి,
తృణమును ద్రుంచి తన ముందుంచి,
మారు పల్కె సీత దీనస్వరమున,
తృణము కన్న రావణుడే హీనమన.

రామలక్ష్మణులు లేని సమయమున,
అపహరించితివె నను ఆశ్రమమున.
పురుషసింహముల గాలికి బెదిరి,
పారిపోతివి శునకము మాదిరి.

యమకుబేరుల ఇంద్రాది దేవతల,
గెలిచిన నీకీ వంచనలేల ?
అని పల్కె సీత దీన స్వరమున,
తృణము కన్న రావణుడే హీనమన.

ఓయి రావణా ! నా మాట వినుము,
శ్రీ రామునితో వైరము మానుము.
శీఘ్రముగా నను రాముని జేర్చుము.
త్రికరణ శుద్ధిగా శరణు వేడుము.

నిను మన్నించి అనుగ్రహింపుమని,
వేడుకొందు నా కరుణామూర్తిని.
అని పల్కె సీత దీన స్వరమున,
తృణము కన్న రావణుడే హీనమన.

|| శ్రీ హనుమాను ||

ఓ సీతా ! నీవెంత గడసరివె,
ఎవరితో యేమి పల్కుచుంటివె ?
ఎంతటి కర్ణ కఠోర వచనములు,
ఎంతటి ఘోర అసభ్య దూషణలు.

నీ పై మోహము నను బంధించెను,
లేకున్న నిను వధించియుందును,
అని గర్జించెను ఘనకరగాత్రుడు,
క్రోధోద్దీప్తుడై దశకంఠుడు.

నీకొసగిన ఏడాది గడువును,
రెండు నెలలలో తీరిపోవును.
అంతదనుక నిన్నంటగ రాను,
ఈలోపున బాగోగులు కనుగొను.

నను కోరని నిను బలాత్కరించను,
నను కాదను నిను కనికరించను.
అని గర్జించెను ఘనకరగాత్రుడు,
క్రోధోద్దీప్తుడై దశకంఠుడు.

ఓ రావణా ! నీ క్రొవ్విన నాలుక,
గిజగిజలాడి తెగిపడదేమి ?
కామాంధుడా నీ క్రూర నేత్రములు,
గిర గిర తిరిగి రాలిపడవేమి ?

పతి యాజ్ఞ లేక యిటులుంటి గాని,
తృటిలో నిన్ను దహింపనా యేమి ?
అని పల్కె సీత దివ్య స్వరమున,
తృణము కన్న రావణుడే హీనమన.

క్రోధాగ్ని రగుల రుషరుష లాడుచు,
కొరకొర చూచుచు నిప్పులు గ్రక్కుచు.
తన కాంతలెల్ల కలవరమొందగ,
గర్జన సేయుచు, దిక్కులదరగ.

సీతనెటులైన వొప్పించుడని,
వొప్పకొననిచో భక్షించుడని,
రావణాసురుడు అసురవనితలను,
ఆజ్ఞాపించి మరలిపోయెను.

|| శ్రీ హనుమాను ||

అందున్నవొక వృద్ధ రాక్షసి,
తోటి రాక్షసుల ఆవల ద్రోసి.
కావలెనన్న నన్ను వధింపుడు,
సీతను మాత్రము హింసింపకుడు.

దారుణమైన కలగంటి నేను,
దానవులకది ప్రళయమ్మేను.
అని తెల్పె త్రిజట స్వప్నవృత్తాంతము,
భయకంపితలైరి రాక్షసీ గణము.

శుక్లాంబరములు దాల్చినవారు,
రామలక్ష్మణులు అగుపించినారు.
వైదేహికి యిరువంకల నిలచి,
దివ్యతేజమున వెలుగొందినారు.

తెల్లని కరిపై ముప్వురు కలసి,
లంకాపురిపై పయనించినారు.
అని తెల్పె త్రిజట స్వప్నవృత్తాంతము,
భయకంపితలైరి రాక్షసీ గణము.

దేవతలందరు పరిసేవింప,
ఋషిగణంబులు అభిషేకింప,
గంధర్వాదులు సంకీర్తింప,
బ్రహ్మాదులు మునుముందును దింప,

సీతారాముడు విష్ణుదేవుడై,
శోభిల్లెను కోటి సూర్య తేజుడై.
అని తెల్పె త్రిజట స్వప్నవృత్తాంతము,
భయకంపితలైరి రాక్షసీ గణము.

తైలమలదుకొని రావణాసురుడు,
నూనె త్రాగుచూ అగుపించినాడు.
కాలాంబరమును ధరియించినాడు,
కరవీరమాల దాల్చినాడు.

పుష్పకమందుండి నేలబడినాడు,
కడకొక స్త్రీచే యీడ్వబడినాడు.
అని తెల్పె త్రిజట స్వప్నవృత్తాంతము,
భయకంపితలైరి రాక్షసీ గణము.

రావణుండు వరాహముపైన,
కుంభకర్ణుడు ఒంటెపైన,
ఇంద్రజిత్తు మకరముపైన,
దక్షిణ దిశగా పడిపోయినారు.

రాక్షసులందరు గుంపుగుంపులుగ,
మన్నున కలిసిరి సమ్మూలమ్ముగ.
అని తెల్పె త్రిజట స్వప్నవృత్తాంతము,
భయకంపితలైరి రాక్షసీ గణము.

తెల్లని మాలలు వలువలు దాల్చి,
తెల్లని గంధము మేన బూసికొని,
నృత్య మృదంగ మంగళ ధ్వనులతో,
చంద్రకాంతులెగజిమ్ము ఛత్రముతో,

తెల్లని కరిపై మంత్రివర్యులతో,
వెడలె విభీషణుడు దివ్యకాంతితో.
అని తెల్పె త్రిజట స్వప్నవృత్తాంతము,
భయకంపితలైరి రాక్షసీ గణము.

విశ్వకర్మ నిర్మించిన లంకను,
రావణుండు పాలించెడు లంకను,
రామదూత యొక వానరోత్తముడు,
రుద్రరూపుడై దహియించినాడు.

ప్రళయ భయానక సదృశమాయెను,
సాగరమున లంక మునిగిపోయెను.
అని పల్కు త్రిజట మాటలు వినిచు,
నిద్రతూగిరి రాక్షసి వనితలు.

హృదయ తాపమున జానకి తూలుచు,
శోకభారమున గడగడ వొణకుచు,
జరిగి జరిగి అశోక శాఖలను,
ఊతగాగొని మెల్లగ నిలచి,

శ్రీ రాముని కడసారి తలచుకొని,
తన మెడజడతో వురిపోసుకొని,
ప్రాణత్యాగము జేయబూనగా,
శుభ శకునములు తోచె వింతగా.

సీతకెంత దురవస్థ కటిల్లె,
నా తల్లినెటుల వూరడించవలె ?
నన్ను నేనెటుల తెలుపుకోవలె,
తల్లినెటుల కాపాడుకోవలె ?

యే మాత్రము నే ఆలసించిన,
సీతామాత ప్రాణములుందునా ?
అని హనుమంతుడు శాఖలమాటున,
తహతహలాడుచు మెదలసాగెను.

నను గని జానకి బెదరక ముందే,
పలికెద సీతారామ కథ.
సత్యమైనది, వ్యర్థము గానిది,
పావనమైనది, శుభకరమైనది.

సీతా మాతకు కడి ప్రియమైనది,
పలుకు పలుకున తేనెలొలుకునది,
అని హనుమంతుడు మృదుమధురముగా,
పలికెను సీతారామ కథ.

దశరధ విభుడు రాజోత్తముడు,
యశముగొన్న ఇక్ష్వాకు వంశజుడు.
దశరధునకు కడు ప్రియమైన వాడు,
జ్యేష్ఠ కుమారుడు శ్రీ రఘురాముడు.

సత్యవంతుడు, జ్ఞానశ్రేష్ఠుడు,
పితృవాక్య పరిపాలన శీలుడు.
అని హనుమంతుడు మృదుమధురముగా,
పలికెను సీతారామ కథ.

శ్రీ రాముని పట్టాభిషేకము,
నిర్ణయమైన శుభసమయమున,
చిన్న భార్య కైక దశరథు జేరి,
తనకొసగిన రెండు వరములు కోరె.

భరతునకు పట్టాభిషేకము,
పదునాల్గేండ్లు రామ వనవాసము.
అని హనుమంతుడు మృదుమధురముగా,
పలికెను సీతారామ కథ.

తండ్రిమాట నిలుప రామచంద్రుడు,
వల్కల ధారియై రాజ్యము వీడె.
సీతాలక్ష్మణులు తనతో రాగా,
పదునాల్గేండ్లు వనవాసమేగె.

ఖరదూషణాది పదునాల్గువేల,
అసురుల జంపె జనస్థానమున.
అని హనుమంతుడు మృదుమధురముగా,
పలికెను సీతారామ కథ.

రాముడు వెడలె సీత కోర్కె పై,
మాయ లేడిని కొనితెచ్చుటకై.
రామ లక్ష్మణులు లేని సమయమున,
అపహరించె లంకేశుడు సీతను.

సీతను గానక రామచంద్రుడు,
అడవుల పాలై వెదకుచుండెను.
అని హనుమంతుడు మృదుమధురముగా,
పలికెను సీతారామ కథ.

రామసుగ్రీవులు వనమున కలిసిరి,
మిత్రులైరి ప్రతిజ్ఞల పూనిరి.
శ్రీ రఘురాముడు వాలిని కూల్చెను,
సుగ్రీవుని కపిరాజుగ చేసెను.

సుగ్రీవులాన లంక చేరితి,
సీతా మాతను కనుగొన గల్గితి.
అని హనుమంతుడు మృదుమధురముగా,
పలికెను సీతారామ కథ.

వానరోత్తముడు పలుకుట మానెను,
జానకికెంతో విస్మయమాయెను.
భయము భయముగ నలువంకలు గని,
మెల్లగ మోమెత్తి పైకి చూచెను.

శోభిల్లు శంశుపా శాఖలందున,
బాలార్కుని వలె మారుతి తోచెను.
మారుతి రూపము చిన్నదైనను,
తేజోమయమై భీతి గొల్పెను.

|| శ్రీ హనుమాను ||

"తల్లీ !తెల్పుము నీవు యెవరవో,
దేవ గంధర్వ కిన్నెరాంగనవో .
కాంతులు మెరసే బంగరు మేన,
మలినాంబరమేల దాల్చితివో ?

ఓ కమలాక్షీ ! నీ కనుదోయి,
నీలాలేల నింపితివో ?"
అని హనుమంతుడు తరువు నుండి దిగి,
అంజలి ఘటించి చెంతన నిలిచె.

రావణాసురుడు అపహరించిన,
రాముని సతివో నీవు సీతవో ?
రామ లక్ష్మణులు వనమున వెదకెడు,
అవనీజాతవో నీవు సీతవో ?

సర్వసులక్షణ లక్షిత జాతవు,
తల్లీ ! తెల్పుము నీవు యెవరవో ?"
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి చెంతన నిలిచె.

"జనక మహీపతి ప్రియ పుత్రికను,
దశరధ మహీపతి పెద్ద కోడలను.
శ్రీ రఘురాముని ప్రియ సతి నేను,
సీత యను పేర వరలు దానను.

పరిణయమైన పదిరెండేడులు,
అనుభవించితిని భోగభాగ్యములు."
అని పల్కె సీత వానరేంద్రునితో,
రామ కథను కీర్తించిన వానితో.

"రావణుడొసగిన యేడాది గడువు,
రెండు నెలలో యిక తీరిపోవు.
రాముడు నన్ను కాపాడునని,
వేచి వేచి వేసారి పోతిని.

అసురులు నన్ను జంపక ముందే,
నాకై నేను పోనించితిని."
అని పల్కె సీత వానరేంద్రునితో,
రామ కథను కీర్తించిన వానితో.

"అమ్మా సీతా, నమ్ముము నన్ను,
రాముని దూతగా వచ్చినాడను.
రామ లక్ష్మణులు క్షేమమన్నారు,
నీ క్షేమమరసి రమ్మన్నారు.

రాముడు నీకు దీవెనలంపె,
సౌమిత్రి నీకు వందనములిడె."
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి ముందుకు జరిగె.

మారుతి యెంతగా ముందుకు జరిగెనో,
జానకి అంతగా అనుమానించెను.
రావణాసురుడే ఈ వానరుడని,
కామరూపుడై వచ్చి యుండునని.

ఆశ్రమమున వొంటిగ నున్న తనను,
వంచించిన సన్యాసి యీతడని.
తల వాల్చుకొని భయకంపితయై,
కటిక నేలపై జానకి తూలె.

"వానరరాజ సుగ్రీవుని మంత్రిని,
నన్ను పిలుతురు హనుమంతుడని.
రామ సుగ్రీవులు మిత్రులైనారు,
నీ జాడ తెలియ వేచియున్నారు."

రామలక్ష్మణులు వానర రాజుతో,
లంక చేరెదరు వానర కోటితో.
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి చెంతన నిలిచె.

|| శ్రీ హనుమాను ||

"ఓ హనుమంతా ! హాయి పొందితిని,
నీ పలికిన శ్రీరామ కథ విని.
రామ లక్ష్మణుల యెట్లెరిగితివి ?
రూపు రేఖలను యెట్లు గాంచితివి ? "

"వారి మాటలను యెట్లు వింటివి ?
వారి గుణములను యెట్లు తెలిసితివి ?"
అని పల్కె సీత హనుమంతునితో,
రామ కథను కీర్తించిన వానితో.

"సర్వ జీవన సంప్రీతి పాత్రుడు,
కమల నేత్రుడు, దయా సాంద్రుడు.
బుద్ధియందు బృహస్పతి సముడు,
కీర్తి యందు దేవేంద్రుని సముడు. "

"క్షమా గుణమున పృథివీ సముడు,
సూర్య తేజుడు శ్రీ రఘురాముడు."
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి చెంతన నిలిచె.

"అన్నకు తగు తమ్ముడు లక్ష్మణుడు,
అన్నిట రాముని సరిపోలు వాడు.
అన్నకు తోడు నీడయై చెలగెడు,
అజేయుడు, శత్రుభయంకరుడు. "

"సామాన్యులు కారు సోదరులిరువురు,
మిము వెదకుచు మమ్ము కలసినారు. "
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి చెంతన నిలిచె.

పవనకుమారుని పలుకులను విని,
అతడు నిజముగా రామదూత యని.
ఆనందాశ్రులు కన్నులు నిండగ,
చిరు నగవులతో జానకి చూడగ.

"ఇదిగో తల్లీ ! యిది తిలకింపుము,
రాముడంపిన అంగుళీయకము."
అని హనుమంతుడు భక్తి మీరగను,
అంగుళీయకమును సీతకొసగెను.

|| శ్రీ హనుమాను ||

రామచంద్రుని ముద్రిక చేకొని,
అశ్రులు నిండిన కనులకద్దుకొని.
మధుర స్మృతులు మదిలో మెదల,
సిగ్గు చేత తన శిరము వంచుకొని.

యిన్ని రోజులకు తనకు కలిగిన,
శుభ శకునముల విశేషమనుకొని.
జానకి పల్కె హనుమంతునితో,
సంపూర్ణమైన విశ్వాసముతో.

"యెన్నడు రాముడు యిటకేతెంచునో,
యెన్నడు రావణుని హతము సేతునో ?
లక్ష్మణుండు తన అగ్ని శరములతో,
క్రూర రాక్షసుల రూపు మాపునో ?"

"సుగ్రీవుడు తన వానర సేనతో,
చుట్టి ముట్టి యీ లంకను కూల్చునో ?"
అని పల్కె సీత హనుమంతునితో,
సంపూర్ణమైన విశ్వాసముతో.

"రామలక్ష్మణులు వచ్చుదాకను,
బ్రతుకనిత్తురా అసురులు నన్ను ?
రావణుడొసగిన యేడాది గడువు,
రెండు నెలలలో యిక తీరిపోవు. "

"ప్రాణములను అరచేత నిల్పుకొని,
యెదురు చూతునీ రెండు మాసములు"
అని పల్కె సీత హనుమంతునితో,
సంపూర్ణమైన విశ్వాసముతో.

"నీ వలెనే శ్రీరామచంద్రుడు,
నిద్రాహారములు మరచెనమ్మా !
ఫలపుష్పాదులు ప్రియమైనవి గని,
"హా సీతా !" యని శోకించునమ్మా."

"నీ జాడ తెలిసి కోదండపాణి
తడవు సేయకే రాగలడమ్మా."
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి చెంతన నిలిచె.

"ఓ హనుమంతా ! నిను గనినంత,
నాలో కలిగె ప్రశాంతత కొంత.
వానరోత్తమా ! నిను వినినంత,
నే పొందితిని వూరట కొంత."

"రాముని వేగమె రమ్మని తెల్పుము,
రెండు నెలల గడువు మరువబోకుము."
అని పల్కె సీత హనుమంతునితో,
సంపూర్ణమైన విశ్వాసముతో.

|| శ్రీ హనుమాను ||

"తల్లీ నీవిటు శోకించనేల,
వగచి వగచి యిటు భీతిల్లనేల ?
యిపుడే నీకీ చెర విడిపింతును,
కూర్చుండుము నా మూపు మీదను."

"వచ్చిన త్రోవనే కొనిపోయెదను,
శ్రీ రామునితో నిను జేర్చెదను."
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి చెంతన నిలిచె.

"పోనివ్వక పోతివిగా హనుమా !
సహజమైన నీ చంచల భావము.
అలయగ అల్ప శరీరుడవీవు,
యే తీరుగ నను కొని పోయెదవు ?"

"రాముని కడకే నను చేర్చెదవో,
కడలిలోననే జారవిడుతువో."
అని పల్కె సీత హనుమంతునితో,
తనలో కలిగిని వాత్సల్యముతో.

సీత పల్కిన మాటల తీరును,
హనుమంతుడు విని చిన్నబోయెను.
సీత చెంత తన కామ రూపమును,
ప్రదర్శింపగా సంకల్పించెను.

కొండంతగ తన కాయము పెంచెను,
కాంతివంతుడై చెంత నిలచెను.
జయ హనుమంతుని కామరూపమును,
ఆశ్చర్యముతో జానకి చూచెను.

"అద్భుతమౌ నీ కామరూపమును
కాంచితినయ్యా, శాంతించుమయ్యా !
పవనకుమారా, నీవు కాక మరి,
యెవరీ వారిధి దాటెదరయ్యా ! "

"క్రూర రాక్షసుల కంట బడకయే,
లంక వెదకి నను కనగలరయ్యా"
అని పల్కె సీత హనుమంతునితో,
సంపూర్ణమైన విశ్వాసముతో."

||శ్రీ హనుమాను ||

"తల్లీ ! నేను నీ యందు గల,
భక్తి భావమున అటుల తెల్పితి.
క్రూర రాక్షసుల బారి నుండి నిను,
కాపాడనెంచి అటుల తెల్పితి."

"వేగమె నిన్ను రాముని జేర్చెడు,
శుభ ఘడియలకై త్వరపడి పల్కితి."
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి చెంతన నిలిచి.

"తల్లీ నీవు తెలిపినవన్నీ ,
శ్రీ రామునకు విన్నవించెదను.
సత్య ధర్మ పవిత్ర చరిత్రవు,
శ్రీ రామునకు తగిన భార్యవు."

"అమ్మా యిమ్మూ యేదో గురుతుగ,
శ్రీ రాముడు గని ఆనందింపగ."
అని హనుమంతుడు సీతతో పలికె,
అంజలి ఘటించి చెంతన నిలిచి.

చిత్రకూటమున కాకాసురు కథ,
కన్నీరొలుకగ గురుతుగ తెలిపి.
చెంగుముడి నున్న చూడామణిని,
మెల్లగ తీసి మారుతికొసగి.

పదిలముగా కొని పోయిరమ్మని,
శ్రీ రామునకు గురుతుగ నిమ్మని.
ప్రీతి పల్కె సీత హనుమంతునితో,
సంపూర్ణమైన విశ్వాసముతో.

చేతులారగ చూడామణి గొని,
ఆనందముగ కనులకద్దుకొని;
వైదేహికి ప్రదక్షిణలు జేసి,
పదముల వ్రాలి, వందనములిడి.

మనమున రాముని ధ్యానించుకొని,
మరలిపోవగా అనుమతి గైకొని.
అంజనీసుతుడు కాయము పెంచె,
ఉత్తర దిశగా కుప్పించి యెగసె.

|| శ్రీ హనుమాను ||

"సీత జాడ గని మరలిన చాలదు,
చేయవలసినది యింకను కలదు.
కల్పించుకుని కలహము పెంచెద,
అసురవీరుల పరిశీలించెద.

రాక్షస బలముల శక్తి గ్రహించెద,
సుగ్రీవాదులకు విన్నవించెద."
అని హనుమంతుడు యోచన చేయుచు,
తోరణ స్తంభము పైన నిల్చెను.

పద్మాకరముల పాడొనరించి,
జలాశయముల గట్టులు త్రెంచి;
ఫల వృక్షముల నేలను కూల్చి,
ఉద్యానముల రూపులు మాపి;

ప్రాకారముల బ్రద్దలు చేసి,
ద్వారబంధముల ధ్వంసము జేసి;
సుందరమైన అశోకవనమును,
చిందర వందర చేసె మారుతి.

మృగ సమూహములు భీతిల్లినవై,
తత్తరపాటుగ పరుగులు తీయగ;
పక్షుల గుంపులు చెల్లాచెదరై,
దీనారవముల యెగిరి పోవగ.

సీత యున్న శింశుపా తరువు వినా,
వనమంతయు వినాశము కాగా;
సుందరమైన అశోకవనమును,
చిందర వందర చేసె మారుతి.

వనమున రేగిన ధ్వనులకు అదిరి,
లంకావాసులు నిద్ర లేచిరి;
కావలియున్న రాక్షస వనితలు,
రావణు జేరి విన్నవించిరి.

దశకంఠుడు మహోగ్రుడై పల్కె,
వానరుని బట్టి దండింపుడనే;
యెనుబది వేల కింకర వీరులు,
హనుమంతునిపై దాడి వెడలిరి.

యెనుబది వేల కింకర వీరుల,
వొక్క వానరుడు హతము చేసెను;
ఈ వృత్తాంతము వినిన రావణుడు,
నిప్పులు గ్రక్కుచు గర్జన చేసెను.

జంబుమాలిని తగిన బలము గొని,
ఆ వానరుని దండింప పొమ్మనెను;
జంబుమాలి ప్రహస్తుని సుతుడు,
హనుమంతుని పై దాడి వెడలెను.

|| శ్రీ హనుమాను ||

జంబుమాలిని సర్వ సైన్యమును,
వొక్క వానరుడు ఉట్టడగించెను.
ఈ వృత్తాంతము వినిన రావణుడు,
నిప్పులు గ్రక్కుచు ఆజ్ఞాపించెను.

మంత్రికుమారుల తగిన బలము గొని,
ఆ వానరుని దండింపగ పొమ్మనె;
మంత్రికుమారులు యేడ్గురు జేరి,
హనుమంతుని పై దాడి వెడలిరి.

మంత్రిసుతులను సర్వ సైన్యమును,
మారుతి తృటిలో సంహరిమచెను;
యెటు చూచినను మృత దేహములు,
యెటు పోయినను రక్తపుటేరులు.

ఈ వృత్తాంతము వినిన రావణుడు,
కొంత తడవు యోచించి పల్కెను;
సేనాపతులను తగిన బలము గొని,
ఆ వానరుని దండింప పొమ్మనెను.

సేనాపతులను సర్వ సైన్యమును,
పవనకుమారుడు నిర్మూలించెను;
ఈ వృత్తాంతము వినిన రావణుడు,
నిశ్చేష్టితుడై పరివీక్షించెను.

తండ్రిమాపులు తనపై సోకగ,
అక్ష కుమారడు హిటవుగ నిలువగ;
రావణుండు పల్కె కుమారుని గని,
ఆ వానరుని దండింప పొమ్మని.

|| శ్రీ హనుమాను ||

అక్షకుమారుడు నవ యౌవ్వనుడు,
వేగవంతుడు, తేజోవంతుడు;
దివ్యాస్త్రములను పొందినవాడు,
మణిమయ స్వర్ణ కిరీట శోభితుడు.

కాలాగ్ని వోలె ప్రజ్వరిల్లెడు,
రణధీరుడు మహావీరుడు;
అక్షకుమారుడు దివ్య రథము పై,
దాడి వెడలెను, హనుమంతుని పై.

మూడు శరములతో మారుతి శిరమును,
పది శరములతో మారుతి ఉరమును;
అక్షకుమారుడు బలముగ నాటెను,
రక్తము చిందగ గాయ పరచెను.

ఉదయ భాస్కర సమాన తేజమున,
మారుతి యెగనె గగన మార్గమున;
యిరువురి నడుమ భీకరమైన,
పోరు చెలరేగె ఆకాశమున.

అతి నేర్పు తోడ రణము సల్పెడు,
అక్షకుమారుని మారుతి దయగొని;
బాలుని చంపగ చేతులు రావని,
వేచి చూచెను నిగ్రహించుకొని.

అక్షకుమారుడు అంతకంతకును,
అగ్నిహోత్రుడై రణమున రేగెను;
యిరువురి నడుమ భీకరమైన,
పోరు చెలరేగె ఆకాశమున.

అగ్ని కణమని జాలి కూడదని,
రగులక మునుపే ఆర్పుట మేలని;
సింహనాదమును మారుతి చేసెను,
అరచేత చరచి హయముల జంపెను.

రథమును బట్టి విరచి వేసెను,
అక్షుని ద్రుంచి విసరి వేసెను;
అక్షుని మొండెము అతి ఘోరముగ,
నేలపై బడె రక్తపు ముద్దగ.

అక్ష కుమారుని మరణ వార్త విని,
లంకేశ్వరుడు కడు దుఃఖించెను;
మెల్లగ తేరి క్రోధము బూని,
తన కుమారుని ఇంద్రజిత్తు గని.

ఆ వానారుడు సామాన్యుడు గాడని,
వానిని వేగ బంధించి తెమ్మని;
రావణాసురుడు ఇంద్రజిత్తును,
హనుమంతుని పై దాడి పంపెను.

కపికుంజరుడు భయంకరముగ,
కాయము పెంచి సమరము సేయగ;
ఈ వానరుడు సామాన్యుడు గాడని,
మహిమోపేతుడు కామరూపుడని.

ఇంద్రజిత్తు బహుయోచన చేసి,
బ్రహ్మాస్త్రమును ప్రయోగము చేసె;
దేవ గణంబులు సంగ్రామము గని,
తహతహలాడిరి యేమగునోయని.

బ్రహ్మాస్త్రము చే బంధింపబడి,
పవనకుమారుడు నేల పై బడె;
వనజభవుడు తనకు వొసగిన వరము,
స్మరియించకొని ప్రార్ధన చేసె.

వాయు బ్రహ్మ ఇంద్రాది దేవతల,
కాపాడుమని ధ్యానము జేసె;
దేవ గణంబులు సంగ్రామము గని,
తహతహలాడిరి యేమగునోయని.

కట్టుబడియున్న వానరోత్తముని,
అసురులు తలచిరి తమకు లొంగెనని;
త్వరత్వరగా దానవులు దరి జేరి,
నారచీరెలతో బిగి బంధించిరి;

బ్రహ్మ వరమున బ్రహ్మాస్త్ర బంధము,
క్షణకాలములో తొలగి పోయెను;
మారుతి మాత్రము నారచీరెలకె,
కట్టుబడినటుల కదలక యుండె.

వానరోత్తముని దూషణలాడుచు,
రావణు కడకు యీడ్చుకు పోవగ;
ఈ వానరుని వధించివేయుడని,
మన యెడ ద్రోహము చేసినాడని.

రక్తనేత్రముల నిప్పులు రాలగ,
లంకేశ్వరుడు గర్జన సేయగ;
రావణు తమ్ముడు విభీషణుడు,
దూతను చంపుట తగదని తెల్పెను.

|| శ్రీ హనుమాను ||

"అన్నా రావణ ! తెలిసినవాడవు,
శాంతముగా నా మనవిని వినుమా ;
దూతను జంపుట ధర్మము గానిది,
లోకముచే గర్హింపబడునది. "

"శూరుడవైన నీకు తగనిది,
రాజ ధర్మ విరుద్ధమైనది";
అని విభీషణుడు లంకేశునితో,
దూతను చంపుట తగదని తెల్పెను.

"అన్నా ! వీనిని వధింపకుమా,
తగు రీతిని దండించి పంపుమా;
దూత యెడల విధింపబడినవి,
వధ గాక తగిన దండనలున్నవి."

"తల గొరిగించుట, చబుకు వేయుట,
గురుతు వేయుట, వికలాంగు సేయుట";
అని విభీషణుడు లంకేశునితో,
దూతను చంపుట తగదని తెల్పెను.

|| శ్రీ హనుమాను ||

"కపులకు వాలము ప్రియ భూషణము,
కావున కాల్చుడు వీని వాలము;
వాడ వాడల వూరేగింపుడు,
పరాభవించి వదలివేయుడు."

"కాలిన తోకతో వీడేగు గాక !
అంపిన వారికి తలవంపు గాక !"
అని రావణుడు విభీషణుని గని,
ఆజ్ఞాపించెను కోపమణచుకొని.

జీర్ణాంబరములు అసురులు దెచ్చిరి,
వాయుకుమారుని తోకకు చుట్టిరి;
నునెతో తడిపి నిప్పంటించిరి,
మంటలు మండగ సంతసించిరి.

కపికుంజరుని యీడ్చుకు పోయిరి,
నడి వీధులలో వూరేగించిరి;
మారుతి మాత్రము మిన్నకుండెను,
సమయము కాదని సాగిపోయెను.

కపిని బంధించి తోక గాల్చిరని,
నడి వీధులలో త్రిప్పుచుండిరని;
రాక్షస వనితలు వేడుక మీరగ,
పరుగున పోయి సీతకు తెలుపగ.

అంతటి ఆవద తన మూలమున,
వాయుసుతునకు, వాటిల్లెనని;
సీతా మాత కడు చింతించెను,
అగ్ని దేవుని ప్రార్ధన చేసెను.

ఓర్వరానివై మండిన మంటలు,
ఒక్కసారిగా చల్లగ తోచెను;
అగ్ని దేవునకు, నా జనకునకు,
అన్యోన్యమైన మైత్రిచేతనో.

రామ దూతనై వచ్చుట చేతనో,
సీతా మాత మహిమ చేతనో;
మండే జ్వాలలు పిల్ల గాలులై,
వీవసాగెనని మారుతి పొంగెను.

ఆనందముతో కాయము పెంచెను,
బంధములన్నీ తెగిపడిపోయను;
అడ్డగించిన అసురులందరని,
అరచేత చరచి అట్టడగించెను.

గిరిశిఖరము వలె యెత్తగ నున్న,
నగర ద్వార గోపుర మందున;
స్తంభము పైకి మారుతి యెగసెను,
లంకాపురమును పరివీక్షించెను.

|| శ్రీ హనుమాను ||

యే మంటల నా వాలము కాల్చిరో,
ఆ మంటలనే లంక కాల్తునని;
భీమ రూపుడై గర్జన సేయుచు,
రుద్ర రూపుడై మంటల జిమ్ముచు.

మేడ మిద్దెల వనాల భవనాల,
వెలిగించెను జ్వల తోరణాల;
చూచి రమ్మనిన కాల్చి వచ్చిన,
ఘన విఖ్యాతి గడించె మారుతి.

ఒకచో కుంకుమ కుసుమ కాంతుల,
ఒకయెడ బూరుగు పుష్పచ్ఛాయల;
ఒకచో మోదుగు విరుల తేజముల,
ఒకయెడ కరగిన లోహపు వెలుగుల.

కోటి సూర్య సమాన కాంతుల,
లంకాపురము రగిలెను మంటల;
చూచి రమ్మనిన కాల్చి వచ్చిన,
ఘన విఖ్యాతి గణించె మారుతి.

|| శ్రీ హనుమాను ||

హనుమంతుడు సముద్ర జలాల,
చల్లార్చుకొనే లాంగూల జ్వాల;
తలచిన కార్యము నెరవేర్చితినని,
తేరిపార జూసె వెనుకకు తిరిగి.

కనిపించెను ఘోరాతిఘోరము,
జ్వాలాతీరము లంకాపురము;
మారుతి వగచె తా చేసిన పనిగని,
తన కోపమె తన శత్రువాయెనని.

"సీతా మాత క్షేమము మరచితి,
కోపతాపమున లంక దహించితి;
లంకా పురము సర్వము పోగా,
ఇంకా జానకి మిగిలియుండునా ?"

"సిగ్గు మాలిన స్వామి ద్రోహిని,
సీతను చంపిన మహా పాపినని";
మారుతి వగచె తా చేసిన పనిగని,
తన కోపమె తన శత్రువాయెనని.

"సీత లేనిదె రాముడుండడు,
రాముడు లేనిదె లక్ష్మణుడుండడు;
భరత శత్రుఘ్న సుగ్రీవాదులు,
ఈ దుర్వార్త విని బ్రతుకజాలరు".

"ఈ ఘోరమునకు కారణమైతినని,
నాకు మరణమే శరణ్యమని" ;
మారుతి వగచె తా చేసిన పనిగని,
తన కోపమె తన శత్రువాయెనని.

"శ్రీ రఘురాముని ప్రియసతి సీత,
అగ్ని వంటి మహా పతివ్రత;
అగ్నిని అగ్ని దహింపనేర్చునా ?
అయోనిజను అగ్ని దహించునా ? "

"నను కరుణించిన అగ్ని దేవుడు,
సీతను చల్లగ చూడకుండునా ?"
అని హనుమంతుడు తలచుచుండగా,
శుభ శకునములు తోచె ప్రీతిగా.

యెల్ల రాక్షసుల సిరి సంపదలు,
మంటల పాలై దహనమాయెనని;
అశోక వనము ధ్వంసమైనను,
జానకి మాత్రము క్షేమమేనని.

లంకాపురము రూపుమాసినను,
విభీషణు గృహము నిలిచి యుండెనని;
అంబర వీధిని సిద్ధచారణులు,
పలుకగా విని మారుతి పొంగెను.

||శ్రీ హనుమాను ||

అశోక వనము మారుతి చేరెను.
ఆనందాశ్రుల సీతను గాంచెను;
"తల్లీ ! నీవు నా భాగ్యవశమున,
క్షేమముంటివ" ని, పదముల వ్రాలెను.

"పోయి వత్తునిక, సెలవునిమ్మ" ని,
అంజలి ఘటించి చెంత నిలచెను;
సీతా మాత హనుమంతునితో,
ప్రీతిగ పలికెను ఆనందముతో.

"హనుమా ! అతులిత బలధామా !
శత్రుకర్షణా ! శాంతినిదానా !
యిందుండి నన్ను యీ క్షణమందే,
కొనిపోగల సమర్థుడవీవే".

"రాముని వేగమె తోడ్కొని రమ్మ,
రాక్షస చెర నాకు తొలగింపుము";
అని పల్కె సీత హనుమంతునితో,
సంపూర్ణమైన విశ్వాసముతో.

"తల్లీ ! నిన్ను చూచినదాదిగ,
త్వరపడుచుంటిని మరలిపోవగ;
భీతినొందకుము, నెమ్మదినుండుము,
త్వరలో నీకు శుభములు కలుగు."

"రామ లక్ష్మణ సుగ్రీవాదులను,
అతి శీఘ్రముగా కొనిరాగలను";
అని మారుతి సీత పదముల వ్రాలె,
సెలవుగైకొని రివ్వన మరలె.

|| శ్రీ హనుమాను ||

అరిష్టమను గిరిపై నిలిచి,
మారుతి యెగసెను కాయము పెంచి;
పవనకుమారుని పదఘట్టనకే,
పర్వతమంతయు పుడమిని కృంగె.

సీతను గాంచిన శభవార్త వేగ,
శ్రీ రామునకు తెలియజేయగ;
మారుతి మరలెను అతి వేగముగ,
ఉత్తర దిశగా వారిధి దాటగ.

గరుడుని వోలె శరవేగము గొని,
పెద్ద పెద్ద మేఘాలు దాటుకొని;
మార్గ మధ్యమున మైనాకుని గని,
ప్రేమ మీరగా క్షేమము కనుగొని.

దూరము నుండి మహేంద్ర శిఖరిని,
ఉత్సాహమున ముందుగా గని;
విజయ సూచనగ గర్జన సేయుచు,
మారుతి సాగెను వేగము పెంచుచు.

సుందరమైన మహేంద్రగిరి పైన,
సెలయేట దిగి తానమాడి;
జాంబవదాది పెద్దలందరికి,
వాయునందనుడు వందనములిడి.

"చూచుతి సీతను, చూచితి సీతను !"
అను శుభవార్తను ముందుగ పలికెను;
కపి వీరులు హనుమంతుని పొగడిరి,
ఉత్సాహమున కిష్కింధకు సాగిరి.

జాంబవదంగద హనుమదాదులు,
ప్రశ్రవణగిరి చేరుకొనినారు;
రామ లక్ష్మణ సుగ్రీవాదులకు,
వినయముతో వందనమిడినారు.

ఆంజనేయుడు శ్రీరామునితో,
"చూచుతి సీతన" ని శుభవార్త తెల్పె;
చూడామణిని శ్రీ రామునకిడి,
అంజలి ఘటించి చెంతని నిలచె.

|| శ్రీ హనుమాను ||

చూడామణిని రాముడు గైకొని,
తన హృదయానికి చేర్చి హత్తుకొని;
మాటలు రాని ఆనందముతో,
అశ్రులు నిండిన నయనాలతో.

"హనుమా ! సీతను యెట్లు గాంచితివి,
యెట్లున్నది సీత, యేమి తెల్పినది ?";
అని పలికిన శ్రీ రామచంద్రునకు,
మారుతి తెల్పె తన లంకా యానము.

"శత యోజనముల వారిధి దాటి,
లంకాపురమున సీతను గాంచితి;
రాలు కరుగగా సీత పలుకగ,
నా గుండెల క్రోధాగ్ని రగులగ".

"అసురుల గూల్చితి, లంక దహించితి,
రావణునితో సంవాదము సల్పితి."
అని మారుతి తన లంకా యానమును,
రామచంద్రునకు విన్నవించెను.

"నిరతము నిన్నే తలచుచున్నది,
క్షణమొక యుగముగ గడుపుచున్నది;
రెండు నెలల గడువు తీరక మునుపే,
వేగమె వచ్చి కాపాడుమన్నది".

"రామ లక్ష్మణ సుగ్రీవాదులకు,
సీత క్షేమమని తెలుపమన్నది."
అని మారుతి తన లంకా యానమును,
రామచంద్రునకు విన్నవించెను.

"రామ లక్ష్మణులను భుజముల నిడుకొని,
వేగమె లంకకు కొని వత్తునని;
రామ లక్ష్మణుల అగ్ని శరములకు,
రావణాదులు కూలుట నిజమని".

"యెన్నో రీతుల సీతా మాతకు,
ధైర్యము గొలిపి నే మరలి వచ్చితిని ";
అని మారుతి తన లంకా యానమును,
రామచంద్రునకు విన్నవించెను.

"అందరు కలసి అయోధ్యకు జేరి,
ఆనందముగా సుఖించెదరని;
సీతారామ పట్టాభిషేకము,
కనుల పండువుగ జరిగి తీరునని."

"యెన్నో రీతుల సీతా మాతకు,
ధైర్యము గొలిపి నే మరలి వచ్చితిని ";
అని మారుతి తన లంకా యానమును,
రామచంద్రునకు విన్నవించెను.

"ఆనందముతో అశ్రులు జారగ,
సీతా మాత నను దీవించగ;
పదముల వ్రాలి నే పయనమైతిని,
పదములు రాక నే మరలి వచ్చితిని."

"ఒప్పలేదు గాని యెపుడో తల్లిని,
భుజములనిడుకొని కొనిరాకుందునా !";
అని మారుతి తన లంకా యానమును,
రామచంద్రునకు విన్నవించెను.

|| శ్రీ హనుమాను ||

"సీత క్షేమమను శుభవార్త నేడు,
మారుతి నాకు తెలుపకుండిన;
నేటి తోడ మా రఘుకులమంతా,
అంతరించి యుండెడిది కదా ! "

"మమ్మీ తీరుగ వుద్ధరించిన,
మారుతికి యేమివ్వగలన" ని;
"సర్వమిదేన"ని కౌగిట చేర్చెను,
హనుమంతుని ఆజానుబాహుడు.

|| శ్రీ హనుమాను ||

నలుగురు శ్రద్ధతో ఆలకింపగ,
నలుగురు భక్తితో ఆలపించగ;
సీతారామహనుమానులు సాక్షిగ,
సర్వ జనులకు శభములు కలుగగ.

కవి కోకిల వాల్మీకి పల్కిన,
రామాయణమును తేట తెల్గున;
శ్రీ గురు చరణా సేవ భాగ్యమున,
పలికెద సితారామ కథ.

|| శ్రీ హనుమాను ||